క్లుప్తంగా

ఏపీ మాజీ సీఎం జగన్‌ను కలిసిన ప్రవీణ్



జనగామ: ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్‌ఆ ర్‌సీపీ రాష్ట్ర యువ నాయకుడు బొడ్డు ప్రవీణ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్ రెడ్డికి దేవుని ఆశీస్సులు ఉండాలని 2014 నుంచి 2023 వరకు తెలంగాణ నుంచి ఏపీకి రెండు సార్లు పాదయాత్ర చేపట్టిన ప్రవీణ్ తాడేపల్లి గూడెం క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం మాజీ సీఎంతో మాట్లాడినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల సంపూర్ణ ఆశీర్వాదంతో అంతా మంచి జరుగుతుందని ఆకాంక్షించారు.

నేడు ముస్లిం మైనార్టీల సమావేశం

జనగామ: జనగామలో ఈ నెల13న హైదరాబాద్ రోడ్డులోని విజయ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీల సమావేశం నిర్వహించడం జరుగుతుందని ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ జమాల్ షరీఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ ఉర్దూ దినపత్రిక న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ హాజరుకానున్నారని చెప్పారు. మజీద్ కమిటీ అధ్యక్షులు, ముస్లిం ప్రతినిధులు, మేధావులు, నాయకులు, యువకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం



కొడకండ్ల: మండలంలోని మైదంచెరువుతండాకు చెందిన ధరావత్ పీన్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, శుక్రవారం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీన్యానాయక్ మృతదేహానికి నివాళులర్పించి రూ.7,500 సాయం బాధిత కుటుంబీకులకు అందజేశారు. నాయకులు సిద్ధూ, భాస్కర్, రవి, హరిసింగ్, హేమాని, ఉపేందర్, కిషన్, భిక్షపతి, కిషన్ ఉన్నారు.

కుంటను తలపిస్తున్న రోడ్డు

చిల్పూరు: మండల కేంద్రంలోని మూడు బాటల నుంచి హనుమాన్, సమ్మక్క ఆలయానికి వెళ్లే రోడ్డులో చినుకుపడితే నీరు నిలిచి చిన్న కుంటలా మారుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతి పత్రాలను వేర్వేరుగా అందజేశారు. రోడ్డుపై నీరు నిల్వడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని, నీటితో దోమలు ఎక్కువై కుట్టడంతో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

'ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి'

జఫర్‌గఢ్: ప్రేమోన్మాది నాగరాజును కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జువారి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చెన్నారావుపేట మండలంలోని గుండెంగ గ్రామంలోని 16 చింతల్ తండాకు చెందిన గిరిజన యువతి దీపికను ప్రేమపేరుతో మోసం చేసి ఆమె తల్లిదండ్రులను అతి కిరాతకంగా నరికి చంపి, ఆమెను, సోదరుడిని గాయపరిచిన ప్రేమోన్మాది నాగరాజును ఎన్‌కౌంటర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

● పద్మశ్రీ గడ్డం సమ్మయ్య

దేవరుప్పుల: మారుమూల పల్లెలోని పాఠశాల విద్యార్థుల అభ్యున్నతి కోసం పాటుపడిన ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే పెద్దమడూరు పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు లాల్మానాయక్, అశోక్, మాజీ సర్పంచ్ సుధాకర్, ఎస్‌ఎంఎస్ చైర్మన్ మహేందర్, రవికాంత్, శివప్రసాద్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సుచిత్ర ఆనంద్, భద్రయ్య, శ్యామలాదేవి, వాణిశ్రీ, బీకోజీ, దస్రూ, సత్యనారాయణ, జ్యోతి, విమల ఉన్నారు.

పదోన్నతి బాధ్యతలను పెంచుతుంది

రఘునాథపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ కాలంలో ఎంతో కాలంగా ఎదురు చూసే పదోన్నతి అనేది తన కర్తవ్యంలో మరింత చురుగ్గా పనిచేయడానికి బాధ్యతలను పెంచుతుందని మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. ఖిలాషాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని జాఫర్‌గూడెం ప్రాథమిక పాఠశాలలో 10 ఏళ్లుగా ఎస్‌జీటీ (స్కూల్ గ్రేడ్ టీచర్) హోదాలో పనిచేసి ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతిలో భాగంగా అశ్వరావుపల్లి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన భద్రు వీడ్కోలు సమావేశాన్ని హెచ్‌ఎం శాగ కైలాసం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం భారతిరవీందర్, ఉపాధ్యాయులు సునీల, అనురాధ, పంచాయతీ కార్యదర్శి కోటి, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దేవరుప్పుల: అప్పిరెడ్డిపల్లెలో సన్మాన గ్రహీతలతో సమ్మయ్య తదితరులు

ఉద్యోగికి బదిలీ సహజం

బచ్చన్నపేట: ఉద్యోగులకు బదిలీలు సహజమని మండల నోడల్ అధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్యాంమోహన్ రాజు, ఉపాధ్యాయురాలు ఉషారాణి బదిలీపై వెళ్లారు. కాగా వీరికి నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబద్ధతతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలిని అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం పాఠశాలకు రూ. 10 వేల విరాళం ఇచ్చి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కమిటీ చైర్మన్ అరుణ, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, మండల కార్యదర్శి సంతోష్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: పదోన్నతి పొందిన భద్రును సన్మానిస్తున్న రఘునందన్‌రెడ్డి



బచ్చన్నపేట: బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

అంగడి ఆవరణ పరిశీలన

చిల్పూరు: చిల్పూరుగుట్ట ఆలయం వద్ద అపరిశుభ్రంగా ఉన్న అంగడి ఆవరణను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించి అక్కడ నివాసముంటున్న వారినుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అంగడి ఆవరణ అధ్వానం' శీర్షికన కథనం ప్రచురితమైంది. కాగా, శుక్రవారం చిల్పూరుగుట్ట వద్ద టీఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు, ఆలయ మాజీ చైర్మన్ నాగరాజు సాక్షిలో ప్రచురితమైన కథనాన్ని చూపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వారి కోరిక మేరకు అంగడి ఆవరణను ఎమ్మెల్యే సందర్శించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ విమలను పిలిపించి డబుల్ రోడ్డు మంజూరయ్యే వరకు అంగడి ఆవరణలోని నివాస గృహాల వద్ద నీరు నిల్వకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ శాశ్వత అభివృద్ధి దాత శ్రీధర్‌రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ యాదవరెడ్డి, కాందూరి రంగరాజు, పంతం రాజు, నారగోని రవి, పంతం హేమ, బాల్నె స్వరూప, మాచర్ల కోమళ, అనసూర్యమ్మ ఉన్నారు.

తేనీటి విందులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే..

మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం జాతీయ చేనేత సంఘం ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్- వేదవతి నివాసంలో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల యాదవరెడ్డి, లింగారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, గడ్డమీది వెంకటస్వామి, ఇల్లందుల యాదగిరి, ఎల్‌ఐసీ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



అంగడి ఆవరణను పరిశీలిస్తున్న కడియం

సాక్షి స్పందన

ఒలింపియాడ్‌లో 'సెయింట్ పాల్స్' ప్రతిభ

జనగామ: గత ఏడాది జాతీయస్థాయిలో నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహించిన టాలెంట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు ఏరియా సెయింట్ పాల్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని ప్రిన్సిపాల్ మరియ జోసఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో గణిత విభాగంలో 27 మెడల్స్, సైన్స్‌లో 25, ఇంగ్లిష్‌లో 22, సాంఘిక శాస్త్రంలో 17 మెడల్స్, మొత్తంగా 91 మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రస్థాయిలో ఎక్సలెన్స్ అవార్డ్స్ గణిత విభాగంలో 3, ఇంగ్లిష్‌లో 5, సైన్స్‌లో 2, డ్రాయింగ్‌లో ఒకరు, సాంఘికశాస్త్ర విభాగంలో ఇద్దరు మెడల్స్ సాధించినట్లు చెప్పారు. జాతీయస్థాయిలో వరుసగా రెండో సారి గోల్డెన్ స్కూల్, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డులతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డ్స్ రావడం జరిగిందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నేటి సృజనాత్మకత, నైపుణ్యంతో కూడిన విద్య ఉంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారన్నారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు.



ఉత్తమ విద్యార్థులతో ప్రిన్సిపాల్ మరియ జోసఫ్, టీచర్లు

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ అమలు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్‌సీఆర్ కాజీపేట డివిజన్ ఇంజనీరింగ్ విభాగం కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ కోరారు. రైల్వే కార్మికులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సికింద్రాబాద్‌లోని డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె కార్యక్రమానికి ఘన్‌పూర్ డివిజన్ నుంచి రైల్వే కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కార్మికుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే తీర్మానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైల్వే కార్మిక సంఘం నాయకులు కె.బిక్షపతి, దేవయ్య, కరుణాచారి, శ్యామ్‌యాదవ్, నర్సింహస్వామి, భాస్కర్, బాలరాజు, శ్రీను, కుమార్

ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలి



ఎన్‌సీసీ కేడెట్లతో ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ ఎన్‌సీసీ కేడెట్లు శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని, కాగితంతో తయారు చేసిన వస్తువులను వినియోగించాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎ.అంజిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి ఆర్.శాంతి మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతయని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎన్‌సీసీ అధికారి కె.ప్రకాశం, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సోమరాజు, పీడీ డాక్టర్ వెంకటేశ్వర్లు, వెంకటేష్, విజయకుమారి, శ్రీనివాస్, కౌర్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలోకి చేరిన పేదలు

15 రోజుల్లో అర్హులను ఎంపిక చేస్తాం! : అధికారులు

పాలకుర్తి: మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయడం లేదని పేదలు శుక్రవారం అందులోకి చేరి పంపిణీ చేయాలని ఆందోళన చేపట్టారు. స్థానికులు మాట్లాడుతూ డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా అర్హులను గుర్తించి పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. కాగా, విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సాయి ప్రసన్న కుమార్ అక్కడకు చేరుకొని వారితో చర్చించారు. 15 రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి పట్టాలు అందజేస్తామని నచ్చజెప్పారు. సీపీఎం మండల అధ్యక్షుడు మాచర్ల సారయ్య, స్థానికులు పాల్గొన్నారు.



పేదలకు నచ్చజెప్పుతున్న అధికారులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పాలకుర్తి: మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన రైతు పిట్టల లక్ష్మయ్య(55) అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ప్రసన్న కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కూతురు వివాహం కోసం భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ లక్ష్మయ్య అప్పులపాలయ్యాడు. వ్యవసాయ పెట్టుబడి కోసం అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈ నెల 9న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నర్మెట: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ శివాలయ అభివృద్ధికి గోపగోని శ్రీధర్ రూ.1,00,116లను శుక్రవారం విరాళంగా అందజేశారు. దాతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు జంగిటి అంజయ్య, గ్రామస్తులు ప్రజ్ఞాపురం శ్రీధర్, కొండం బాలయ్య, ముక్కెర రాజేష్, పల్లె ప్రభుదాస్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న శ్రీధర్

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ విమలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 70లో ఉన్న 47 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సముద్రాల రాజు, పిట్టల కుమారస్వామి, మండల సహాయ కార్యదర్శి భువనగిరి కుమార్, ఆవుల గణేష్, పంగ రాంచంద్రయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గృహజ్యోతి పథకానికి అర్హత ఉండి లబ్ధి చేకూరని విద్యుత్ వినియోగదారులు ప్రజాపాలన సేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ ఎం.హుస్సేన్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులో గతంలో విద్యుత్ సర్వీసు నంబర్ తప్పుగా నమోదైనవారు, లబ్ధిదారులై నివాసం మార్చుకున్నవారు, పాత విద్యుత్ సర్వీసు నంబర్ స్థానంలో కొత్త విద్యుత్ సర్వీస్ నంబర్ చేయించాలనుకునేవారికి వెసులుబాటు కల్పించబడిందన్నారు. పూర్తి వివరాల కోసం ప్రజాపాలన సేవాకేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

దేవరుప్పుల: ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నగరిగారి ప్రీతమ్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల మాదిరి కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సజావుగా కొనసాగేలా కార్పొరేషన్ పదవులను త్వరతగతిన నియమించడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తోటకూరి పాండు కృష్ణ, బీసీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు కాడబోయిన గణేష్ , సజ్జన్‌నాయక్, దామెర అనిల్‌కుమార్, భోనగిరి యాకస్వామి,రెడ్డి రాజుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రీతమ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గ్రంథాలయం ప్రారంభం



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సంపత్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను సమకూర్చడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను విద్యాభిమానులు గ్రంథాలయానికి అందజేయాలని కోరారు.

కొండా దంపతులను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండామురళిలను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. మొదటగా వారు మనోజ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో కొండ మురళి గ్రామానికి వచ్చిన సందర్భంగా దుర్గామాతకు నెక్లెస్ చేయిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా రూ. 4 లక్షలను మనోజ్‌రెడ్డికి అందజేశారు. అనంతరం ఆయన పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గం ఇన్‌చార్జ్ రంగు హరీశ్‌తో కలిసి హనుమకొండలో నెక్లెస్‌కు ఆర్డర్ ఇచ్చారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

పాలకుర్తి: పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నల్లపు మానికఅశోక్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా మానిక మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరి.. తామే సొంతంగా రూ.10లక్షలతో పనులు చేయించి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. నమ్మిన వాళ్లను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నామని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజీనామా ఆమోదించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

పండ్లు పంపిణీ



రఘునాథపల్లి: లయన్స్‌క్లబ్ 320 ఎఫ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రఘునాథపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూరెళ్ల ఉపేందర్ హాజరుకాగా క్లబ్ అధ్యక్షుడు కందుల అనీల్‌కుమార్, రాజుగౌడ శంకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, కరుణాకర్, సురేష్ పాల్గొన్నారు.

పరామర్శ

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన నర్ర కొండయ్య మృతి చెందాడు. కాగా, శుక్రవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు నిబంధనలు విస్మరిస్తే చర్యలు

దేవరుప్పుల: రోడ్డు నిబంధనలు విస్మరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని జనగామ-సూర్యాపేట రహదారిలో ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా రోడ్డుపై వాహనాలు తిప్పితే జరిమానాలతోపాటు జైలు తప్పదన్నారు. హెల్మెట్లు, సీటు బెల్టు వంటి జాగ్రత్తల పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహణ తీరు, రికార్డుల పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. కొడకండ్ల ఎస్సై శ్రావణ్, ఏఎస్సై సదానందం, సిబ్బంది ఉన్నారు.

పీరీల ఊరేగింపు

పాలకుర్తి టౌన్: ఈ నెల 17న మొహర్రంను పురస్కరించుకొని ముస్లింలు శుక్రవారం పీరీలను వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో దాసరి మధు, బండి కొండయ్య, మామిండ్ల యాకయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తిలో నిర్వహించిన బీజేపీ నాయకుల సమావేశంలో సంపత్ మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసంపూర్తిగా ఉన్న మరుగు దొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు శ్రీను, వెంకన్న, పట్టణ అధ్యక్షుడు సంతోష్, దేవరాజ్, రాజు పాల్గొన్నారు.

నత్తనడకన వైకుంఠధామం పనులు

● త్వరగా పూర్తి చేయాలంటున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: ఆఖరి మజిలీ గౌరవప్రదంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద గ్రామాల్లో వైకుంఠధామాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ఒక్కో వైకుంఠధామానికి నిర్మాణాల కోసం రూ 12.60 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. మండలంలోని సోమయ్యకుంటతండాకు మంజూరైన వైకుంఠధామాన్ని గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తున్నారు. పనులు చేపట్టిన మాజీ సర్పంచ్ భర్త నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, వైకుంఠధామానికి స్వాగత ద్వారం, బోరు వేసి కరెంటు మోటారు ఏర్పాటు, రెండు గదులు, స్నానాల గదులు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఇక్కడ సగం పనులు చేసి వదిలేయడంతో నిర్మాణాలు చెట్లపొదలతో నిండాయి. పనులు పూర్తి చేయక పోవడంతో గ్రామస్తులు అంత్యక్రియలకు సొంత భూములనే ఆశ్రయిస్తున్నారు. భూమిలేని వారి పరి స్థితి దయనీయంగా మారింది. అధికారులు స్పందించి వైకుంఠధామం పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భర్త నర్సింహను వివరణ కోరగా వైకుంఠధమం నిర్మాణం పనులకు పంచాయతీ రాజ్ ఏఈ ఎంబీ రికార్డు చేయకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయన్నారు. చేసిన పనులకు రూ. 5 లక్షలు మాత్రమే తీసుకున్నామని, ఇప్పటికే ముగ్గురు ఏఈలు మారారని, సమస్య వివరించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీ సుకెళ్లి త్వరలో పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.



సోమయ్యకుంటతండా శివారులో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం

బోనాల పాట చిత్రీకరణ



బచ్చన్నపేట: మండల కేంద్రంలో ప్రైవేట్ ఛానల్ వారి ఆధ్వర్యంలో బోనాల పాటను చిత్రీకరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తాడిచెట్ల రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద పలువురు కళాకారులతో బోనాల పాటను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు సాయికిరణ్ మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయలను వివరించడానికి ఈ పాటలను చిత్రీకరిస్తున్నామని తెలిపారు. ఆషాడం, శ్రావణ మాసాల్లో తెలంగాణలో దేవతలకు బోనాలను చేస్తారని.. అందుకే జానపద పాటలను చిత్రీకరిస్తున్నామని అన్నారు.